సమావేశంలో మాట్లాడుతున్న బడితల సమ్మయ్య

ఎల్లో, రెడ్ కార్డుల అమలును నిలిపేయాలి

టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య

భూపాలపల్లి రూరల్, జూలై 14: సింగరేణి యజమాన్యం ఎల్లో, రెడ్ కార్డుల అమలును నిలిపేయాలని భూపాలపల్లి టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రక్షణ చర్యల్లో భాగంగా సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డుల విధానాన్ని అమలు చేసే పనిలో ఉందని, పని స్థలాల్లో ఉద్యోగులు పొరపాటు చేస్తే స్థానిక అధికారులు మెయిల్ పెట్టడం ద్వారా కార్పొరేట్ ఆఫీస్ నుంచి ఆ కార్మికుడికి నేరుగా ఎల్లో కార్డు జారీ అయినట్టు ఫోన్‌కు సందేశం వచ్చేలా మార్పులు చేపట్టారని తెలిపారు. ఎవరైనా కార్మికుడికి మూడుసార్లు ఎల్లో కార్డు వస్తే వెంటనే రెడ్ కార్డు జారీ చేస్తారని, రెడ్ కార్డు అందుకున్న కార్మికుడికి చార్జ్‌షీట్‌తో పాటు సస్పెన్షన్, ఇంక్రిమెంట్ కట్, డిస్మిస్.. ఇలా ఏదైనా క్రమశిక్షణ చర్యలకు యాజమాన్యం పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. క్రీడా ప్రాంగణంలో ఆడే క్రీడాకారులకు రెఫరీ ఎల్లో కార్డు చూపించి వార్నింగ్ ఇస్తారు. రెడ్ కార్డు చూపిస్తే అతడిని ఆరోజు జరిగే ఆట నుంచి తొలగిస్తారు. మళ్లీ ఇంకో ఆటకు అనుమతి ఉంటుంది. కానీ ఇక్కడ కార్మికుడికి రెడ్‌కార్డు ఇచ్చి అతన్ని ఉద్యోగం నుంచి తొలగిస్తే అతడినే నమ్ముకున్న కుటుంబం పరిస్థితి ఏమిటనేది యాజమాన్యం ఆలోచించాలన్నారు. సింగరేణి సంస్థకు లాభం చేకూర్చేందుకు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పనిచేసే కార్మికులను గౌరవించాలని కోరారు. ఇప్పటికే కొంతమంది కార్మికులకు ఎల్లో కార్డు ఇస్తూ సందేశాలు కూడా వచ్చాయని తెలిపారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి దృష్టికి ఈ విషయం వచ్చిన వెంటనే సీఎండీకి, సంబంధిత అధికారులతో చర్చించడం జరిగిందని, వెంటనే ఈ సర్క్యులర్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల సంక్షేమం కోసం ఉద్యమం చేస్తామని తెలియజేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులను కేవలం ఓటర్లుగా మాత్రమే చూస్తున్నాయని, కార్మికుల సంక్షేమం పక్కన పెట్టి యాజమాన్యానికి అనుకూలంగా మారి కార్మికులకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. టీబీజీకేఎస్ నాయకులు గౌరీపతిశర్మ, నరేశ్, మధు, రాంచందర్, రాజేందర్, సురేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి రూ.2.50లక్షల ఎల్‌వోసీ మంజూరు

కాటారం, జూలై 14: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కాటారం మండలం కొత్తపల్లికి చెందిన కందుల శివ గోవిందమ్మకు ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల ఎల్ ఓసీ మంజూరైంది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికసాయం కోసం మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరవతో సీఎంఆర్ ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు కాగా, ఆదివారం ఆయన సహాయకుడు హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేస్తున్న మంత్రి సహాయకులు

పింఛన్‌దారుల నిరసనను విజయవంతం చేయాలి

గణపురం, జూలై 14: కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ జాక్ కో ఆర్డినేటర్ బోనాల రాజమౌళి పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పెన్షన్‌దారులకు బకాయి ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, ఈహెచ్ఎస్ స్కీమ్ ద్వారా అన్ని కార్పొరేట్ హాస్పిటళ్లలో నగదు రహిత చికిత్స వర్తింపజేయాలని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పెన్షన్‌దారులకు ప్రత్యేక ఇన్సెంటివ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డి మాండ్ల సాధన కోసం చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు.

మెడికల్ కళాశాల తరగతులను ప్రారంభించాలి

ములుగు రూరల్, జూలై 14: ఈ విద్యా సంవత్సరం నుంచి మెడికల్ కళాశాల తరగతులను ప్రారంభించాలని బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 2023లో రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కళాశాల ఇవ్వగా జిల్లాకు సైతం మంజూరైందని తెలిపారు. ఇతర చోట్ల తరగతులకు ఈ నెలలో కౌన్సెలింగ్ ప్రారంభం కానుండగా జిల్లాలో ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు పడకపోవడం బాధాకరమన్నారు. స్థానిక మంత్రి సీతక్క దృష్టిసారించి మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

TOURS & TRAVELS

★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

PLOT FOR SALE
★ వరంగల్ హైవేలోని ఆలేరు-కొలనుపాకలో ఓపెన్ ప్లాట్లు మరియు ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్లు అమ్మబడును. సాగర్ హైవేలో ఇండస్ట్రియల్ ఏరియాగా అభివృద్ధి చెందుతున్న యాదాగిరినందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & క్లియర్ టైటిల్. Ph: 7989747927.
NT-325882

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

మళ్లీ నిలిచిన ఐరన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు

ఏటూరునాగారం, జూలై 14: మండలంలోని దొడ్ల జంపన్నవాగుపై ఐరన్‌తో ఏర్పాటు చేస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులకు మళ్లీ బ్రేక్ పడింది. నాలుగు రోజులు పియర్స్, గర్డర్స్‌ను అమర్చే పనులను గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ శాఖ అధికారులు చేపడుతున్నారు. క్రేన్‌లు, జేసీబీ సాయంతో గర్డర్స్‌ను అమర్చే ప్రయత్నాలు చేపట్టారు. శనివారం సాయంత్రం వాగులో వరద పెరుగుతుండగా గర్డర్స్ అమర్చేందుకు సపోర్ట్‌గా ఉన్న జేసీబీ, క్రేన్‌లను తొలగించగా కొంచెం కుంగడంతో దారి కోసం అమర్చే గర్డర్ వెల్డింగ్‌లు ఊడిపోయినట్లు తెలుస్తోంది. వాగు ప్రవాహంతో పనులు నిలిచాయి. వాటిని తిరిగి అమర్చేందుకు జాయింట్ల వద్ద వెల్డింగ్ చేయాల్సి ఉందని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు. వాగులో వరద తగ్గితే పనులు జరిగే అవకాశం ఉంది. ముందే చేయాల్సి పనులు వర్షాలు పడే సమయంలో చేపట్టడంతో ఆటంకం ఏర్పడుతోంది.

అధ్వానంగా జాతీయ రహదారి

- ఎన్‌హెచ్-163పై భారీ వాహనాల రాకపోకలు
- ప్రమాదకరంగా గుంతలు, గాడాలు
- నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం
- సీసీ కెమెరాలు, లైటింగ్, రోడ్ సేఫ్టీ లేవు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని వైనం

బరువైన వాహనాల పోవడంతో దిగబడి ప్రమాదకరంగా మారిన చిన్నబోయినపల్లి-తాడ్వాయి మధ్యలోని జాతీయ రహదారి

చిన్నచిన్న గుంటలతో జాతీయ రహదారి

ఏటూరునాగారం, జూలై 14: జాతీయ రహదారి ధ్వంసమై ప్రమాదాలకు నిలయంగా మారింది. అయినప్పటికీ అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. హైదరాబాద్ టు భూపాలపట్నం 163వ జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో తాడ్వాయి నుంచి ముల్లకట్ట బ్రిడ్జి వరకు అనేకచోట్ల కుంగిపోయి గాడాలు ఏర్పడ్డాయి. దీంతో చిన్న వాహనాలకు కింద ఇంజిన్లకు తగిలి దెబ్బతింటున్నాయి.

పలు ప్రమాదాల్లో 20 మందికి పైగా మృతి

ఈ రోడ్డులో ఇటీవల పలు ప్రమాదాల్లో 20 మందికి పైగా చనిపోయారు. పలుచోట్ల గోతులు పడినప్పటికీ జాతీయ రహదారి అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం అవసరమైనచోట సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేయడం లేదు. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల నుంచి ఇసుక భారీ లోడ్‌తో లారీలు, చత్తీస్‌గఢ్ నుంచి భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. వాహనాల బరువుకు జాతీయ రహదారిపై టైర్లు వెళ్లిన ప్రాంతంలో కుంగి అనేకచోట్ల గాడాలు పడ్డాయి. రోడ్డుపై అక్కడక్కడ లారీలు దిగబడి గుంతలు ఏర్పడ్డాయి. వాటిపై వాహనాలు వెళ్లడంతో స్కిడ్ అవుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అనేకచోట్ల రోడ్డు దెబ్బతిని ఉండగా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. కాగా, రోడ్డుపై వాహనాలు ఢీకొట్టడంతో గేదె లు చనిపోయి అలాగే ఉంటున్నాయి. వాటిని తొలగించ డం లేదు. రాత్రి వేళ తారు రోడ్డుపై పడి ఉన్న గేదెలు కూ డా నల్లగా ఉండడంతో వాహనదారులకు గుర్తించకపోవడంతో ఢీకొట్టడం, వాటిని తప్పించబోయి అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు సరిగా లేక కమలాపురానికి చెందిన విద్యార్థి కూడా ఇటీవల మృతిచెందాడు. ఇలా రోడ్డుపై ప్రమాదాల్లో ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. బొగత జల పాతానికి వందల సంఖ్యలో వాహనాలు వస్తున్నాయి. రాత్రి వేళ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. వారికి బ్రీత్ ఎనలైజర్ టెస్టులు కూడా పోలీసులు సరిగా చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డుపై గుంతలు

రోడ్డుపైనే ఇసుకలారీలు నిలిపేయడం, వేగంగా వెళ్ల డం వంటి వాటికి కళ్లెం వేయడం లేదు. జాతీయ రహదారిపై ప్రభుత్వానికి పలు రకాలుగా ఆదాయం వస్తున్నప్పటికీ నిర్వహణకు నోచుకోవడం లేదు. ఇసుక క్వారీలు విచ్చలవిడిగా ఏర్పాటు చేయడంతో ఎక్కువ చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. గోతులు పడిన చోట వెంటనే పూడ్చకపోవడంతో వర్షాకాలంలో నీళ్లు నిలిచి అవి కాస్త పెద్దవిగా మారుతున్నాయి. గుంతల్లో నీళ్లు నిలిచి అవి ఎంతలోతు ఉన్నాయో డ్రైవర్లకు తెలియడం లేదు. రోడ్డు దెబ్బతిన్న చోట కనీసం సూచికలు ఏర్పాటు చేయడం లేదు. అధి కారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏటూరునాగారం-చిన్నబోయినపల్లి మధ్యలో రోడ్డు పక్కనే ఉన్న గోతులు

చికిత్స పొందుతూ కూతురు మృతి

- ఆటోను కంటెయినర్ ఢీకొట్టిన ప్రమాదంలో తల్లిదండ్రులు, ఆటోడ్రైవర్ మృతి
- నాలుగుకు చేరిన మృతులు
- మృతులకు స్వగ్రామాల్లో అంత్యక్రియలు

అనిత(ఫైల్)

ఏటూరునాగారం/వాజేడు, జూలై 14 : ఏటూరునాగారంలో శనివారం ఆటోను కంటెయినర్ ఢీకొన్న ప్రమాదంలో తల్లిదండ్రులు, ఆటోడ్రైవర్ చనిపోగా, చికిత్సపొందుతూ ఆదివారం కూతురు మృతిచెందింది. వాజేడుకు చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు, సత్యవతీదేవి దంపతుల ఏకైక కుమార్తె సాగి రాజు అనిత(47)ను ఏపీలోని అన్నవరం సమీపంలోని కోదాడకు చెందిన వ్యక్తికి ఇచ్చి 25 ఏళ్ల క్రితం వివాహం చేశారు. కాగా, ఏటా తల్లిదండ్రులను చూసేందుకు ఏటా వస్తుందని బంధువులు తెలిపారు. వృద్ధ తల్లిదండ్రులను చూసేందుకు మూడు రోజుల క్రితం వచ్చిన ఆమెను అత్తగారింటికి పంపేందుకు ఆటోలో శనివారం రాత్రి ఏటూరునాగారం బస్టాండుకు బయల్దేరారు. కంటెయినర్ ఢీకొట్టడంతో తల్లిదండ్రులు చనిపోయారు. తీవ్రంగా గాయపడిన అనితను వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించి చికిత్స పొందుతూ మృతిచెందింది. అనితకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత ఏడాది అనిత తన కుమార్తె వివాహం చేసినట్లు తెలుస్తోంది. కాగా, సత్యనారాయణరాజు(ఎర్రబాబు), సత్యవతీదేవి, ఆటోడ్రైవర్ నాగరాజు మృతదేహాలకు ఆదివారం స్వగ్రామాలైన వాజేడు, నాగారంలో బంధువులు అంత్యక్రియలు చేశారు. అనిత మృతదేహాన్ని భర్త, బంధువులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోదాడకు ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. కాగా, సీపీఎంలో 30 ఏళ్లుగా పనిచేసిన సత్యనారాయణరాజు, సత్యవతీదేవి పార్థివదేహాలపై పార్టీ ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నాయకులు పూలమాలలు వేసి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు బండారు రవికుమార్, యలమంచిలి రవికుమార్, ఎంబీ నర్సారెడ్డి, బ్రహ్మచారి, తిలక్, రత్నం, రాజేందర్, ఎండీ దావూద్, కొప్పుల రఘుపతిరావు, గుగ్గిళ్ల దేవయ్య, దామోదర్, కృష్ణబాబు పాల్గొన్నారు.

సత్యనారాయణ రాజు(ఎర్రబాబు) పార్థివదేహానికి పార్టీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జిల్లాలో మోస్తరు వర్షపాతం

భూపాలపల్లి రూరల్, జూలై 14: జిల్లాలో ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు 9.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మహదేవ్‌పూర్ మండలంలో 9.2 మిల్లీమీటర్లు, మహాముత్తారంలో 12.2, పలిమెలలో 2.4, కాటారంలో 17.6, మల్హార్‌రావు 8.2, టేకుమట్లలో 8.8, మొగుళ్లపల్లిలో 4, చిట్యాలలో 7, రేగొండ మండలంలో 5.2, గణపురంలో 15, భూపాలపల్లి మండలంలో 12.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొండంపల్లిలో వైద్యశిబిరం

గణపురం, జూలై 14: మండలంలోని నగరంపల్లి గ్రామ పంచాయతీ శివారు ఓసీ 3 ప్రాజెక్ట్ ప్రభావిత కొండంపల్లిలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రారంభించిన అనంతరం ఎస్ఓటు జీఎం టీ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పరిసర గ్రామాల ప్రజల కోసం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూపాలపల్లి ఏరియా హాస్పిటల్ వైద్యబృందం హాజరై గ్రామస్తులకు తొలుత వానకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో భిక్షమయ్య పీవోకేటీకే ఓసీ 3 మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ రాజేశ్వరరావు, బాలరాజు, ఎస్ఈ ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం పాల్గొన్నారు.

చిన్నబోయినపల్లిలో..

ఏటూరునాగారం : మండలంలోని చిన్నబోయినపల్లిలో ఆదివారం తుమ్మ సాయిరెడ్డి, కోమల దంపతుల జ్ఞాపకార్థం కుమారులు మెడికేర్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల సౌజన్యంతో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 20 మంది వైద్యులు పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సాయిరెడ్డి, కోమల దంపతుల కుమారులు కేఎంసీ అధికారి తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి తెలిపారు.

విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న రాజ్‌కుమార్

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

మహదేవపూర్, జూలై 14 : వసతి గృహాల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో కనీస వసతులు, కరెంట్ సౌకర్యం లేక రాత్రి వేళల్లో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయాయని, కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారని వివరించారు. మెనూ ప్రకారం భోజనం సక్రమంగా అందడం లేదని, పరిసరాలు చెత్తా చెదారంతో నిండి తీవ్ర దుర్వాసన వస్తున్నాయని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందిం చి వసతి గృహాల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ,లేకుంటటే హాస్టల్ ముందు విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి నియామకం ఇంకెప్పుడు?

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి

మంగపేట, జూలై 14: బడులు తెరుచుకొని నెల రోజులు గడుస్తున్నా మండలంలోని వాగొడ్డుగూడెం ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి తెలిపారు. గ్రామంలోని పాఠశాల వద్ద ఆయన ఆదివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో 25 నుంచి 30 మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆరోపించారు. చుట్టుపక్కల గిరిజన గూడేల్లోని విద్యార్థులకు ఇదే పాఠశాల దిక్కు అని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు ఉన్నారని, ఈ విషయాన్ని గుర్తించి వెంటనే ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గట్టుపల్లి సరిత, నాగేశ్, దబ్బగట్ల రోజా, లక్ష్మీనారాయణ, బొగ్గుల సురేశ్, చంద్ర, భవాని, భిక్షపతి, సున్నం సరిత, శేఖర్, వెంకన్న, శేఖర్, శివకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవి

9వ రోజుకు చేరిన దీక్ష

ములుగు రూరల్, జూలై 14: కలెక్టరేట్ సమీపంలో అంగన్‌వాడీలు చేపట్టిన రిలేని రాహార దీక్ష ఆదివారం 9వ రోజుకు చేరింది. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు సుమలత, ఆదిలక్ష్మీ మాట్లాడుతూ బోన్ పరీక్షలు జరిపి సెంటర్లకు రావద్దనడం ప్రభుత్వానికి తగదని అన్నారు. కొత్త జీవో వచ్చే వరకు పాత జీవో ప్రకారం చేస్తున్న రిటైర్‌మెంట్ ప్రక్రియను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

కేటీకే-1 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీగా మల్లారెడ్డి

అన్నాడి మల్లారెడ్డి

భూపాలపల్లి రూరల్, జూలై 14: జిల్లా కేంద్రంలో ఆదివారం భూపాలపల్లి కేటీకే-1 ఇంక్లైన్ టీబీజీకేఎస్ ఫిట్ కమిటీని బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. భూపాలపల్లి కేటీకే-1 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీగా అన్నాడి మల్లారెడ్డి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా గాండ్ల మొగిలి, షిఫ్ట్ ఇన్‌చార్జిలుగా మామిడి చెట్టి రాజు, కొత్తపెల్లి రాజేశ్వర్‌రావు, బిరుదు శ్రీనివాస్, గుర్రాల రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ నల్లవెల్లి సదానందం, సెంట్రల్ జాయింట్ సెక్రటరీ రత్నం అవినాశ్, బాసనపెల్లి కుమార్ పాల్గొన్నారు.

మంత్రి, ఎంపీని గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

మదనపల్లిలో మంత్రి, ఎంపీకి సత్కారం

ములుగు రూరల్, జూలై 14: మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌ను స్వగ్రామం మండలం మదనపల్లిలో ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. మంత్రి సీతక్క, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ హాజరయ్యారు. ఎంపీగా గెలిచిన తర్వాత తొలిసారి స్వగ్రామానికి రాగా గ్రామస్తులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ, మంత్రిని గజమాలతో సన్మానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి గిరిజన యూ నివర్సిటీ ఏర్పాటును త్వరగా పూర్తిచేస్తామని తెలిపారు. బలరాంనాయక్ మాట్లాడుతూ ములుగు జిల్లాతోపాటు మదనపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సన్మాన సభ కన్వీనర్ పీ ధనుంజయ్‌నాయక్, మదనపల్లి వాస్తవ్యులు ఐపీఎస్ అధికారి పీ మౌనికనాయక్, రంగారెడ్డి జిల్లా కోర్టు జడ్జి పీ ప్రదీప్‌నాయక్, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ పీ శ్రావణ్‌నాయక్, మాజీ మంత్రి పోరిక జగన్నాయక్, గ్రామస్తులు పర్తినాయక్, ఉదయ్‌సింగ్‌నాయక్, నేత కోటేశ్వర్‌రావు, మోహన్‌సింగ్‌నాయక్, పోరిక విజయ్‌రామ్‌నాయక్, ప్రదీప్‌నాయక్, రవి, ధరమ్‌సింగ్‌నాయక్, కందకట్ల యాదగిరి, దేవేందర్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజలు శుభ్రతను పాటించాలి

ములుగు రూరల్, జూలై 14: ప్రజలు పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీని సందర్శించిన ఆయన ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యా ధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుం డా చూసుకోవాలన్నారు. పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని తొల గించా లన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లో భాగంగా బ్యాంకు యాడ్ పౌల్ట్రీ, పాడి, గేదెలు, చిన్నతరహా పరిశ్రమల లోన్లను మంజూరు చేస్తామన్నారు. ఆసరా పింఛన్ అందని వారికి ఆధార్ కార్డు వివరాలు తెలుసుకొని త్వరలోనే ఆసరా పిం ఛన్లు వచ్చేలా చూస్తామని ఎంపీడీవో వివరించారు. ఆదివారం సెలవు అయినప్పటికీ కాలనీలో ఎంపీడీవో పర్యటించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

రెండు ఇళ్లలో చోరీకి యత్నం

ఏటూరునాగారం, జూలై 14: మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్‌లో రెం డు ఇళ్లలో దొంగలు శనివారం రాత్రి చోరీకి యత్నించారు. వస్తువులను చిందరవందర పడేశారు. రెండు ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో దొంగలు తలుపులు తెరుచుకుని లో నికి ప్రవేశించి విలువైన వస్తువుల కోసం వె తికినట్లు తెలుస్తోంది. కాగా, ఆదివారం సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ రెండు ఇళ్లను సందర్శించి పరిశీలించారు. తాము విచారణ చేస్తున్నామని, రాత్రి పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని ఎస్సై తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలి

కృష్ణకాలనీ, జూలై 14: రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేషన్‌కార్డులు లేక అనేక కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు జారీ చ